సాక్షి
వికారాబాద్

సోమవారం। 16। అక్టోబర్। 2023



'గొర్రెల' లొల్లి

కోడ్ అమలులో ఉండగా గొర్రెల పంపిణీ చేస్తున్నారంటూ కాంగ్రెస్ నాయకులు రెండు డీసీఎంలను పట్టుకున్నారు. 10లో▸



నిబంధనలు తప్పనిసరి

ఎన్నికల నిబంధనలు ప్రతి ఒక్కరు పాటించాలని తాండూరు డీఎస్పీ శేఖర్‌గౌడ్ సూచించారు. 10లో▸




కాగితాల్లోనే లెక్క

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన హరితహారం కార్యక్రమం అధికారుల నిర్లక్ష్యంతో నీరుగారుతోంది. 11లో▸

తీన్మార్

కాంగ్రెస్ తొలి జాబితా విడుదల



గడ్డం ప్రసాద్‌కుమార్

రేవంత్‌రెడ్డి

టీఆర్ఆర్

- జిల్లాలో ముగ్గురు అభ్యర్థులకు టికెట్ల కేటాయింపు
- రేవంత్‌రెడ్డి, ప్రసాద్‌కుమార్, రామ్మోహన్‌రెడ్డి పేర్లు ఖరారు
- పెండింగ్‌లో తాండూరు టికెట్

వికారాబాద్: ఎట్టకేలకు హస్తం పార్టీ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థుల తొలి జాబితాను ప్రకటించింది. రాష్ట్రానికి సంబంధించి మొత్తం 55 మంది అభ్యర్థులతో కూడిన మొదటి జాబితాను ఆ పార్టీ అధిష్ఠానం ఆదివారం విడుదల చేసింది. ఇందులో భాగంగా వికారాబాద్ జిల్లా పరిధిలో మొత్తం నాలుగు అసెంబ్లీ సెగ్మెంట్లు ఉండగా ఇందులో మూడు సెగ్మెంట్ల అభ్యర్థుల పేర్లను మొదటి జాబితాలోనే వెలువరించింది. ఇందులో కొడంగల్ నుంచి పీసీసీ చీఫ్ ఎనుముల రేవంత్‌రెడ్డి, పరిగి నుంచి డీసీసీ అధ్యక్షుడు టీ.రామ్మోహన్‌రెడ్డి, వికారాబాద్ నుంచి మాజీ మంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్ పేర్లను ప్రకటించింది. అనుకున్నట్టుగానే తీవ్ర పోటీ ఉన్న తాండూరు అసెంబ్లీ స్థానానికి అభ్యర్థిని ప్రకటించకుండా పెండింగ్‌లో పెట్టింది. మొదట్లో మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి(కేఎల్ఆర్)కి టికెట్ ఖరారు చేస్తారనే ప్రచారం జరుగగా అనూహ్యంగా డీసీసీబీ చైర్మన్ బీ.మనోహర్‌రెడ్డి హస్తం గూటికి చేరి తాండూరు టికెట్‌పై కన్నేయటంతో సీన్ రివర్స్ అయ్యింది. ఇద్దరి మధ్య తీవ్ర పోటీ నెలకొన్న నేపథ్యంలో తాండూరు అభ్యర్థిని ప్రకటించలేదు.

కొడంగల్ నుంచే రేవంత్..

జిల్లాలో ఉన్న నాలుగు నియోజకవర్గాల్లో మూడు చోట్ల కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను ప్రకటించటంతో వారు ఇక ప్రచారంలో దూసుకుపోయేందుకు లైన్ క్లియర్ అయ్యింది. పీసీసీ చీఫ్‌గా ఉన్న రేవంత్‌రెడ్డి గతంలో కొడంగల్ నుంచి మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిచి 2018 ఎన్నికల్లో.. బీఆర్ఎస్ నుంచి ఎలాంటి అంచనాలు లేకుండా రంగంలోకి దిగిన పట్నం నరేందర్‌రెడ్డి చేతిలో అనూహ్యరీతిలో ఓటమి పాలయ్యారు. ఆ వెంటనే జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో రేవంత్ మల్కాజిగిరి నుంచి పోటీ చేసి లోక్‌సభకు ఎంపికయ్యారు. తాజాగా ఆయన తన నియోజకవర్గం కొడంగల్ నుంచే ఎమ్మెల్యేగా పోటీ చేయనున్నారు.

టీఆర్ఆర్‌కే టికెట్..

ఇక పరిగిలో ఎలాంటి పోటీ లేకపోవటంతో టీఆర్ఆర్‌కు టికెట్ ఖరారు చేసింది. టీఆర్ఆర్ 2014లో మాజీ డిప్యూటీ స్పీకర్ దివంగత హరీశ్వర్‌రెడ్డిపై ఎమ్మెల్యేగా గెలుపొందగా.. 2018 ఎన్నికల్లో హరీశ్వర్‌రెడ్డి తనయుడి చేతిలో ఓటమి చవిచూశారు.

ఊహించినట్టుగానే..

ఇక వికారాబాద్‌లో ఎలాంటి పోటీ లేకపోవటంతో ముందుగా ఊహించినట్టుగానే మాజీ మంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్‌కు అధిష్ఠానం హస్తం టికెట్ కట్టబెట్టింది. ఈయన మొదటి సారి 2008 ఉపఎన్నికలో వికారాబాద్ ఎమ్మెల్యేగా మాజీ మంత్రి చంద్రశేఖర్‌పై గెలుపొందాడు. ఆ వెంటనే 2009లో జరిగిన సాధారణ ఎన్నికల్లోనూ ఎమ్మెల్యేగా గెలుపొందగా కొద్ది రోజులకే మంత్రి పదవి సైతం వరించింది. ఆ తర్వాత 2014లో దివంగత సంజీవరావ్ చేతిలో, 2018లో ప్రస్తుత ఎమ్మెల్యే ఆనంద్(బీఆర్ఎస్) చేతిలో ఓటమి పాలయ్యాడు.

రామ్మోహన్‌రెడ్డి (పరిగి)

పేరు:	తమ్మన్నగారి రామ్మోహన్‌రెడ్డి
వయస్సు:	58 సంవత్సరాలు
విద్యార్హత:	ఎంబీఏ, పీహెచ్‌డీ
భార్య:	ఉమారెడ్డి
సంతానం:	రితిక్‌రెడ్డి, మేఘనారెడ్డి
స్వగ్రామం:	శివారెడ్డిపల్లి, దోమ మండలం
పదవులు:	ఎమ్మెల్యే(1)
ప్రస్తుతం:	జిల్లా డీసీసీ అధ్యక్షుడు

ప్రసాద్‌కుమార్ (వికారాబాద్)

పేరు:	గడ్డం ప్రసాద్‌కుమార్
స్వగ్రామం:	తాండూరు
పుట్టిన తేదీ:	04-06-1964
విద్యార్హత:	డిగ్రీ
పదవులు:	ఎంపీపీ, ఎమ్మెల్యే, మంత్రి
భార్య:	గడ్డం శైలజ (దివంగత)
కూతురు:	శ్రీఅనన్య
కుమారుడు:	గడ్డం ఈశ్వర్
అక్కా, చెల్లెళ్లు:	ఎనిమిది మంది
ప్రస్తుతం:	వికారాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి

రేవంత్‌రెడ్డి (కొడంగల్)

పేరు:	ఎనుముల రేవంత్‌రెడ్డి
భార్య:	గీతారెడ్డి
కూతురు:	నైనీశ
అల్లుడు:	సత్యనారాయణరెడ్డి
తండ్రి :	నర్సింహారెడ్డి
పుట్టిన తేదీ:	8-11-1969
స్వగ్రామం:	కొండారెడ్డిపల్లి (మహబూబ్‌నగర్ జిల్లా)
చదువు:	బీఏ
పదవులు:	జెడ్పీటీసీ, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే(2)
ప్రస్తుతం:	టీపీసీసీ అధ్యక్షుడు, మల్కాజిగిరి ఎంపీ



పరిగి: టీఆర్ఆర్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన నాయకులు

గెలుపే లక్ష్యంగా పనిచేద్దాం

- డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి
- కాంగ్రెస్ పార్టీలోకి భారీగా చేరికలు

పరిగి: ప్రజలు బీఆర్ఎస్ పార్టీని, ఆ పార్టీ ప్రకటించిన మేనిఫెస్టోను నమ్మే పరిస్థితిలో లేరని డీసీసీ అధ్యక్షుడు టీ.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణ కేంద్రంలోని మున్నూరుకాపు సంఘం నాయకులు దాదాపు 200 మంది టీఆర్ఆర్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా టీఆర్ఆర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీలు నచ్చి ఎంతోమంది ఇతర పార్టీల నుంచి కాంగ్రెస్‌లో చేరుతన్నారన్నారు. ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు కృష్ణ, సీనియర్ నాయకులు అష్రఫ్, నాయకులు మల్లేష్, రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఏకకాలంలో రైతు రుణమాఫీ..

పూడూరు: తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఏకకాలంలో రూ.2లక్షల రైతు రుణమాఫీ చేస్తామని డీసీసీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే టీ.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. ఆదివారం మొదటి లిస్టులో పరిగి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా తనపేరు ప్రకటించడంతో మండల పరిధిలోని దామగుండం రామలింగేశ్వర స్వామి ఆలయంలో ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పూడూరు మండల పరిధిలోని మీర్జాపూర్, కండ్లపల్లి గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మీర్జాపూర్, కండ్లపల్లి గ్రామాలకు చెందిన దాదాపు 100 మంది నాయకులు ఆయన సమక్షంలో హస్తం పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు పెంటయ్య, శ్రీనివాస్‌రెడ్డి, డీసీసీ కార్యదర్శులు శ్రీనివాస్, అజీంపటేల్, జిల్లా నాయకులు రఘునాథ్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ సతీష్‌రెడ్డి, మండల అధ్యక్షుడు సురేందర్, జిల్లా యువజన విభాగం జిల్లా కార్యదర్శి సుభాష్, నాయకులు పాల్గొన్నారు.

అధికారంలోకి వస్తాం..

యాలాల: రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని డీసీసీబీ చైర్మన్ మనోహర్‌రెడ్డి దీమా వ్యక్తం చేశారు. ఆదివారం మండల పరిధిలోని అన్నసాగర్, పగిడియాల గ్రామాల్లో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశాల్లో ఆయన ఆయన మాట్లాడుతూ.. గతంలో బీఆర్ఎస్ పార్టీ ఇచ్చిన ఏ ఒక్క హామీ నెరవేర్చలేదని దుయ్యబట్టారు. అన్నసాగర్, పగిడియాల గ్రామాలకు చెందిని దాదాపు 100 మంది నాయకులు మనోహర్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. పగిడియాల ఉపసర్పంచ్ నర్సింహులు గౌడ్, మాజీ ఉప సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, రాములు, బీజేపీ నాయకులు వెంకటయ్య, శేఖర్, మల్లప్ప, కాశప్ప, బాలప్ప, రాజు, అంబరప్ప తదితరులు పార్టీలో చేరిన వారిలో ఉన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల మాజీ అధ్యక్షుడు భీమప్ప, కమాల్‌పూర్ సర్పంచ్ బస్వరాజ్, సీనియర్ నాయకులు డాక్టర్ సంపత్‌కుమార్, శ్రీనివాస్‌రెడ్డి, రఘురాంరెడ్డి, సత్యనారాయణరెడ్డి, ఆరీఫ్ హుస్సేన్ తదితరులు ఉన్నారు.

న్యూస్‌రీల్

ప్రజావాణి రద్దు

వికారాబాద్ అర్బన్: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజవాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు కలెక్టర్ సి.నారాయణరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్నందున జిల్లా అధికారులందరూ ఎన్నికల విధుల్లో ఉంటారని.. ఈ కారణంగా ప్రజవాణిని రద్దు చేస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల అనంతరం (డిసెంబర్) తిరిగి ప్రజవాణి నిర్వహిస్తామని కలెక్టర్ తెలిపారు.

హక్కుల కోసం పోరాటం



వీరప్పను సన్మానించిన నాయకులు

పెద్దేముల్: ముదిరాజ్‌ల హక్కుల కోసం పోరాడుతానని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు తలారి వీరప్ప అన్నారు. ఆదివారం పెద్దేముల్‌లో ఆ సంఘం కార్యాలయంలో మండల ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు మల్లేశం ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో నూతనంగా ఎంపికైన జిల్లా అధ్యక్షుడు తలారి వీరప్ప, ముదిరాజ్ జనచైతన్య వేదిక జిల్లా అధ్యక్షుడు నాగభూషణ్‌ను మండల ముదిరాజ్ సంఘం నాయకులు సన్మానించారు. పెద్దేముల్ మండల ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు మల్లేశం, ఉపాధ్యక్షుడు నారాయణ, ముదిరాజ్ సంఘం యూత్ అధ్యక్షుడు రాములు, నాయకులు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రోహిత్‌రెడ్డికి బీఫామ్ అందజేత



తాండూరు: తాండూరు ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి ఆదివారం సీఎం కేసీఆర్ చేతుల మీదుగా బీఆర్ఎస్ పార్టీ తాండూరు అభ్యర్థిగా బీఫామ్ అందుకున్నారు. ఆదివారం ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి ప్రగతి భవన్‌లో సీఎం కేసీఆర్‌ను కలిశారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్ చేతుల మీదుగా బీఫామ్ తీసుకున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో తాండూరు నుంచి భారీ మెజార్టీతో విజయం సాధించాలని రోహిత్‌రెడ్డిని ఆశీర్వదించారు. పార్టీ సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు.

స్వామివారికి పల్లకీసేవ



పల్లకీసేవలో భక్తులు

అనంతగిరి: వికారాబాద్ పట్టణం ఆలంపల్లిలోని శ్రీ లక్ష్మి అనంతపద్మనాభ స్వామివారి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామివారి ఉత్సవ విగ్రహాలకు పల్లకి సేవ నిర్వహించారు. సాయంత్రం ఆలయంలో ధ్వజారోహణం చేపట్టారు. ప్రముఖులు హాజరై పూజలు చేశారు. పురవీధుల్లో విగ్రహాలను ఊరేగించారు. అంతకుముందు స్వామి వారికి ప్రత్యేక అర్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సునందకు 'సేవారత్న'



సునందకు అవార్డు అందజేస్తున్న రాధాకృష్ణ

షాబాద్: పేద ప్రజలకు తేరుపల్లి సునంద చేసిన సేవలు మరువలేనివని బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ అన్నారు. న్యూఢిల్లీలో ఆదివారం జరిగిన సౌత్ ఇండియా బహుజన రైటర్స్ 4వ నేషనల్ కాన్ఫరెన్స్‌లో షాబాద్ మండలం చిన్న సోలీపేట్ గ్రామానికి చెందిన తేరుపల్లి సునందకు సేవారత్న నేషనల్ అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా సునంద మాట్లాడుతూ.. సేవారత్న అవార్డు రావడం చాలా సంతోషంగా ఉందన్నారు.

రాష్ట్రంలో బీజేపీ గాలి వీస్తోంది



పరిగి: సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి

టీచర్స్ ఎమ్మెల్సీ ఏవీఎన్‌రెడ్డి

పరిగి: రాష్ట్రంలో బీజేపీ గాలి వీస్తోందని టీచర్స్ ఎమ్మెల్సీ ఏవీఎస్.రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణ కేంద్రంలోని ఎన్‌వీఎస్ గార్డెన్‌లో ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ గెలుప ఖాయమన్నారు. పేద ప్రజల సంక్షేమం, రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే బీజేపీతోనే సాధ్యమన్నారు. కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ లీడర్ మర్రి శశిధర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు సదానందరెడ్డి, ప్రహ్లాద్‌రావు, నియోజకవర్గ నాయకులు పరమేశ్వర్‌రెడ్డి, రాములు, మారుతికిరణ్, శ్రీనివాస్, మల్లేశ్ పాల్గొన్నారు.

ప్రజలంతా బీజేపీ వైపే..

వికారాబాద్ అర్బన్: తెలంగాణలో ప్రజలంతా బీజేపీ వైపు చూస్తున్నారని మాజీ మంత్రి, బీజేపీ సీనియర్ నాయకులు మర్రి శశిధర్‌రెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక కొండా బాలకృష్టారెడ్డి గార్డెన్‌లో అసెంబ్లీ కన్వీనర్ శ్రీధర్‌రెడ్డి అధ్యక్షతన వికారాబాద్ నియోజకవర్గ అసెంబ్లీ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న మర్రి శశిధర్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రజలు కాంగ్రెస్, బీఆర్ఎస్ పాలనతో విసిగిపోయారన్నారు. అత్యధిక మంది అంతర్గతంగా బీజేపీకి ఓటు వేసేందుకు ఓ నిర్ణయానికి వచ్చినట్లు తెలిపారు. గతంలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్రంలో బీజేపీ అసెంబ్లీ స్థానాలను దక్కించుకోబోతున్నట్లు తెలిపారు. వికారాబాద్ అసెంబ్లీ స్థానంలో కూడా బీజేపీ బలంగా ఉందన్నారు. బీఆర్ఎస్‌కు ప్రత్యామ్నాయం బీజేపీయేనన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఏవీఎస్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు సదానంద్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి పాండుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

హర్షాతిరేకాలు

- బీఆర్ఎస్ మేనిఫెస్టోపై నేతల సంబురాలు
- సంక్షేమానికి పెద్దపీట వేశారని హర్షం
- హ్యాట్రిక్ ఖాయమంటూ నినాదాలు

వికారాబాద్: బీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ ప్రకటించిన ఎన్నికల మేనిఫెస్టోపై సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం ఆయన 51 మంది ఎమ్మెల్యే అభ్యర్థులకు బీ-ఫారాలు అందజేయటంతో పాటు పార్టీ ఎన్నికల మేనిఫెస్టోను విడుదల చేశారు. మేనిఫెస్టోలో సంక్షేమానికే పెద్దపీట వేశారు. ఆసరా, వికలాంగ పెన్షన్ల దశలవారీ పెంపు, సౌభాగ్యలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఆర్థికసాయం, రూ.400కే గ్యాస్ సిలిండర్, జర్నలిస్టులకు ఆరోగ్య పథకం, రైతుబంధు సాయం పెంపు, అర్హులందరికీ బీమా, సన్నబియ్యం, గిరిజనేతరులకు పోడు భూముల పంపిణీ, గృహలక్ష్మి పథకం కొనసాగింపు తదితర హామీల పట్ల మెజార్టీ వర్గాల నుంచి హర్షాతిరేకాలు వ్యక్తం అవుతున్నాయి. మొత్తానికి మేనిఫెస్టోపై ప్రముఖల అభిప్రాయాలు మీ కోసం..



వికారాబాద్ పట్టణంలో బీఆర్ఎస్ శ్రేణుల సంబురాలు

చాలా బాగుంది



సీఎం కేసీఆర్ ప్రకటించిన మేనిఫెస్టోతో ప్రతిపక్షాల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. ఇలాంటి మేనిఫెస్టో గతంలో ఎప్పుడూ చూడలేదు. సంక్షేమానికి పెద్దపీట వేశారు. ఆసరా, వికలాంగుల పెన్షన్ పెరుగుదలపై సర్వత్రా హర్షం వ్యక్తం అవుతోంది. మరోసారి బీఆర్ఎస్‌ను ఆశీర్వదించండి.

– ఆనంద్, ఎమ్మెల్యే, వికారాబాద్

గడగడపకూ తీసుకెళ్తాం



బీఆర్ఎస్ మేనిఫెస్టోతో ప్రతిపక్షాల నోర్లు మూతపడ్డాయి. మేనిఫెస్టోను నాయకులు, కార్యకర్తల ద్వారా గడపగడపకు తీసుకువెళ్తాం. గతంలో ఏ ప్రభుత్వాలు చేపట్టని అభివృద్ధి, సంక్షేమ పథకాలు బీఆర్ఎస్ చేసి చూపించింది. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ హ్యాట్రిక్ కొట్టడం ఖాయం.

– మహేశ్‌రెడ్డి, ఎమ్మెల్యే, పరిగి

ప్రజలు మెచ్చిన మేనిఫెస్టో



సీఎం కేసీఆర్ ప్రకటించిన మెనిఫెస్టో ప్రజలకు విపరీతంగా నచ్చింది. ఇప్పటివరకు ఏ రాజకీయ పార్టీ ప్రజా సంక్షేమం కోసం ఇంతలా కసరత్తు చేయలేదు. మూడోసారి అధికారంలోకి వచ్చిన వెంటనే సంక్షేమ పథకాలు అమలు ప్రారంభం అవుతాయి. ప్రతిపక్ష పార్టీల నోర్లు మూతపడ్డాయి.

– రోహిత్‌రెడ్డి, ఎమ్మెల్యే, తాండూరు

సంక్షేమానికి ప్రాధాన్యత



మేనిఫెస్టోలో పేదల సంక్షేమానికి ప్రాధాన్యత ఇచ్చారు. వచ్చే మార్చి నుంచి ఆసరా ఫించన్లు పెంచుతాం. బీర్ఎస్ మేనిఫెస్టోతో ప్రతిపక్షాల అడ్రస్ గల్లంతు కావడం ఖాయం. ఎన్నికల్లో వారికి డిపాజిట్లు కూడా రావు. కేసీఆర్ మూడోసారి సీఎం అవ్వడం ఖాయం.

– నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే, కొడంగల్

నందీశ్వరా.. గెలుపు బాధ్యత నీదే

బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

యాచారం: నందీశ్వరా.. నా గెలుపు బాధ్యత నీదే.. అంటూ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ఆదివారం ఉదయం నందివనపర్తిలోని నందీశ్వరుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గెలుపు కోసం పార్టీ శ్రేణులు సైనికుల్లా పని చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కర్నాటి రమేష్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి పాశ్చ బాషా, బీఎస్ఆర్ ట్రస్ట్ చైర్మన్ బిలకంటి శేఖర్‌రెడ్డి, నందివనపర్తి సర్పంచ్ కంబాలపల్లి ఉదయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

మేనిఫెస్టో అదిరింది..

ఇబ్రహీంపట్నం: బీఆర్ఎస్ మేనిఫెస్టో అదిరిపోయిందని.. సీఎం కేసీఆర్ దెబ్బకు కాంగ్రెస్ గుండె బెదిరిపోయిందని పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. ఇబ్రహీంపట్నంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం సాయంత్రం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అనేక పథకాలను ప్రవేశపెట్టి అమలు పరిచిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీ స్కీమ్స్ కేసీఆర్ దెబ్బకు దిమ్మతిరిగి కుదేలుకావడం ఖాయమన్నారు. పేదల సంక్షేమంపై ఆయకున్న చిత్తశుద్ధిని మేనిఫెస్టో మరోసారి స్పష్టం చేసిందన్నారు. అంతకు ముందు ఉదయం ఇబ్రహీంపటణంలో పార్టీ కార్యాలయాన్ని పార్టీ రాష్ట్ర నాయకుడు క్యామ మల్లేష్‌తో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నాయకుడు మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి, సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షుడు బూడిద రాంరెడ్డి, ఎంపీపీ కృపేష్, మున్సిపల్ వైస్ చైర్మన్ ఆకుల యాదగిరి తదితరులు పాల్గొన్నారు.



ఇబ్రహీంపట్నం: బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి తదితరులు

జోరుగా తనిఖీలు

ఇబ్రహీంపట్నం: ఎన్నికల నేపథ్యంలో వాహనాల తనిఖీల్లో భాగంగా వేర్వేరుగా రెండు కార్ల నుంచి 53 తులాల బంగారు నగలను స్వాధీ నం చేసుకున్నారు. ఇబ్రహీంపట్నం ఎస్ఐలు మైబెల్లి, కృష్ణారెడ్డి శేరిగూడ క్రాస్ రోడ్డు వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా వేర్వేరుగా రెండు కార్లలో తరలిస్తున్న బంగారాన్ని పట్టుకున్నారు. ఒక కారులో 39 తులాలు, మరో కారులో 14 తులాల బంగారు నగలను స్వాధీనం చేసుకున్నారు. ఈ బంగారాన్ని రిటర్నింగ్ అధికారికి అప్పగించినట్లు తెలిపారు.

మొయినాబాద్‌లో..

మొయినాబాద్: మండల పరిధిలోని గండిపేట చౌరస్తా వద్ద ఆదివారం పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహించారు. ఓ కారులో రూ. 1,18,700 పట్టుబడ్డాయి. ఆ డబ్బులకు సంబంధించి ఎలాంటి రసీదులు లేకపోవడంతో సీజ్ చేశారు.

ఫాంహౌస్‌లపై దాడి..

మొయినాబాద్ పీఎస్ పరిధిలోని రెండు ఫాంహౌస్‌లపై శనివారం అర్ధరాత్రి పోలీసులు దాడులు చేశారు. ఎలాంటి అనుమతి లేకుండా ఫాంహౌస్‌లో పార్టీలు నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో అక్కడికి చేరుకున్న పోలీసులు అనుమతి లేకుండా వినియోగిస్తున్నట్లు 23 లీటర్ల మద్యాన్ని పట్టుకున్నారు. రెండు ఫాంహౌస్‌లపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

కొనసాగుతున్న గురుకుల క్రీడా పోటీలు

రన్నింగ్ పోటీ



మొయినాబాద్: మండల పరిధిలోని చిలుకూరు గురుకులంలో జరుగుతున్న సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల విద్యాలయాల జోనల్ స్థాయి క్రీడా పోటీలు కొనసాగుతున్నాయి. ఆదివారం మూడో రోజు జరిగిన హ్యాండ్ బాల్‌లో చిలుకూరు జట్టు, ఫుట్‌బాల్‌లో గాలిదొడ్డి జట్టు, బాల్ బ్యాడ్మింటన్‌లో పరిగి జట్టు, కబడ్డీలో శంషాబాద్ జట్టు విజయం సాధించాయి. అథ్లెటిక్స్, క్యారమ్స్, చదరంగం పోటాపోటీగా సాగుతున్నాయి. గురుకుల విద్యాలయాల సంస్థ స్పోర్ట్స్ ఆఫీసర్ రామలక్ష్మణ్ విజయం సాధించినవారిని అభినందించారు. రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల ప్రాంతీయ సమన్వయాధికారి శారద, ప్రాంతీయ క్రీడాధికారిఉదయభాస్కర్, ప్రిన్సిపాల్ సత్యనారాయణ, పీడీ ఆదిబాబు, పీఈటీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

149మంది బైండోవర్


ఎస్పీ

అనంతగిరి: జిల్లాలో ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినప్పటి నుంచి 56 బైండోవర్ కేసులు నమోదు చేసి 149మందిని బైండోవర్ చేశామని ఎస్పీ కోటిరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటివరకు రూ.48.68 లక్షల నగదు పట్టుకున్నామని వివరించారు. 71 లిక్కర్ కేసులు నమోదు చేసి శాంతి భద్రతలకు ఎలాంటి విఘాతం కలుగకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపడుతున్నామన్నారు.

భరత్‌కుమార్‌కు జాతీయ అంబేడ్కర్ అవార్డు


అవార్డు అందుకుంటున్న భరత్‌కుమార్

కుల్కచర్ల: వెనుకబాటుకు గురవుతున్న ప్రజలకు సామాజిక స్పృహను కల్పించడంతో పాటుగా నిరుపేదల అభ్యున్నతికి సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న కాంగ్రెస్ పార్టీ బ్లాక్ అధ్యక్షుడు కర్రె భరత్‌కుమార్ జాతీయ అంబేడ్కర్ అవార్డును పొందారు. ఆదివారం ఢిల్లీలో బహుజన జాతీయ సాహిత్య అకాడమీ నేతృత్వంలో కుల్కచర్లకు చెందిన భరత్‌కుమార్‌కు జాతీయ అంబేడ్కర్ అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాము చేస్తున్న కార్యక్రమాలకు అవార్డు అందించడం గొప్పగా భావిస్తున్నానని అన్నారు. అవార్డుతో మరింత బాధ్యత పెరిగిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో బహుజన సాహిత్య అకాడమీ చైర్మన్ రాధాకృష్ణ, కుల్కచర్ల మండల నాయకులు వెంకటేశ్, ఎల్లయ్య, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ పథకాలను కాపీ కొట్టారు

డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నేతలు

కుల్కచర్ల: కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన పథకాలనే సీఎం కేసీఆర్ కాపీ పేస్ట్ చేశారని డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, ఆ పార్టీ మండల అధ్యక్షుడు అంజనేయులు ఎద్దేవా చేశారు. ఆదివారం మండల కేంద్రంలో వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేసీఆర్ చెప్పే అబద్ధాలు విని ప్రజలు విసుగెత్తిపోయారని అన్నారు. కేసీఆర్ ప్రకటించిన మేనిఫెస్టోలో కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన సంక్షేమ పథకాలే కనిపిస్తున్నాయని పేర్కొన్నారు. దళితులకు మూడెకరాల భూమి, దళిత సీఎం, నిరుద్యోగులకు భృతి, నిరుద్యోగ నిర్మూలన గత మేనిఫెస్టోలో పెట్టినా ఒక్కటి కూడా అమలు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్‌పై ప్రజలకు నమ్మకం పోయిందని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి ప్రజలు తగిన బుద్ధి చెబుతారని అన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి గోపాల్‌నాయక్, నాయకులు రాంచంద్రయ్య, శ్రీనివాస్, కృష్ణయ్య, స్వామి తదితరులు పాల్గొన్నారు.

లండన్ నుంచి వచ్చిన మూడు రోజులకే..

అతివేగంతో ప్రాణాలు కోల్పోయిన యువ ఇంజనీర్

యాచారం: అతివేగం ఓ యువ ఇంజినీర్ ప్రాణాలు బలిగొంది. యాచారం సీఐ సైదయ్య తెలిపిన ప్రకారం.. నల్గొండ జిల్లా చింతపల్లి మండలం వింజమూర్ గ్రామానికి చెందిన ఎండీ అమినుద్దీన్, గౌసియాబేగం దంపతుల మూడో కుమారుడు రఫీక్ (25) లండన్‌లో ఎంఎస్ చదువుతున్నాడు. మూడు రోజుల క్రితం ఆయన హైదరాబాద్‌కు వచ్చాడు. చింతపల్లి మండల కేంద్రం సమీపంలో దర్గా వద్ద వారి బంధువులు ఏర్పాటు చేసిన విందుకు హాజరు కావాలని ఆదివారం స్వగ్రామానికి బయలుదేరాడు. అతివేగంగా వెళ్తున్న కారు నాగార్జున సాగర్–హైదరాబాద్ రహదారిపై తుమ్మలోని గేట్‌వద్ద అదుపుతప్పి ఓ చెట్టును ఢీకొట్టింది. దీంతో యువకుడు కారులోనే ఇరుక్కుని ఘటనాస్థలిలోనే మృతి చెందాడు. పోలీసులు మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ఎన్నికల వేళ 'గొర్రెల' లొల్లి!


గొర్రెలను రవాణ చేస్తున్న డీసీఎంలు


తుంకిమెట్లలో బీఆర్ఎస్ పార్టీ నాయకుల ఆందోళన

గొర్రెల డీసీఎంల పట్టివేత
- ఆందోళన వ్యక్తం చేసిన బీఆర్ఎస్ నేతలు

బొంరాస్‌పేట: ఎన్నికల కోడ్ అమలులో ఉండగా గొర్రెల పంపిణీ చేస్తున్నారన్న సమాచారంతో కాంగ్రెస్ నాయకులు రెండు గొర్రెల డీసీఎంలను పట్టుకొని పోలీసులకు అప్పగించారు. దీంతో బీఆర్ఎస్ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఘటన వికారాబాద్ జిల్లా బొంరాస్‌పేట మండలంలో ఆదివారం జరిగింది. వివరాలు ప్రకారం.. మండల పరిధిలోని చౌదర్‌పల్లి, కొత్తూరు గ్రామాలకు చెందిన లబ్ధిదారులు ఆరుగురు చొప్పున గొర్రెల పెంపకం పథకం కింద ఏడునెలల క్రితం డీడీలు కట్టారు. ఒక్కో లబ్ధిదారునికి 20 చొప్పున గ్రామానికి 120 గొర్రెలు, రెండు డీసీఎంలలో 240 గొర్రెలను గుత్తి నుంచి వచ్చాయి. మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆదివారం అర్ధరాత్రి 3గంటలకు నాందార్‌పూర్ వద్ద కాపుకాసి అడ్డుకున్నారు. అధికారులకు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఉదయం ఎస్ఐ శంకర్, ఫ్లెయింగ్‌స్క్వాడ్ ఇన్‌చార్జి ఏఈఓ ఆనంద్ నాందార్‌పూర్‌కు వెళ్లి డీసీఎంలను మండల పశువైద్యశాఖ కార్యాలయానికి తరలించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు వెంకట్రాములుగౌడ్, అంజిల్‌రెడ్డి, రాజేష్‌రెడ్డి, జయకృష్ణ, రాంచంద్రారెడ్డి, నర్సింలునాయుడు, మల్లికార్జున్ తదితరులున్నారు.

బీఆర్ఎస్ నాయకుల ఆందోళన

మండల పరిధిలోని బీఆర్ఎస్ నాయకులు పెద్ద ఎత్తున తరలివచ్చి తుంకిమెట్లలో జాతీయ రహదారిపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పథకాలను, సంక్షేమ కార్యక్రమాలు అడ్డుకోవడం సరికాదని మండిపడ్డారు. గతంలో మంజూరైన గొర్రెలను లబ్ధిదారులకు చేరవేయడంలో తప్పేమిలేదన్నారు. బీఆర్ఎస్ పార్టీ నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, శేరినారాయణరెడ్డి, చాంద్‌పాషా, గోవింద్‌రెడ్డి, బాలప్ప, వెంకటయ్య తదితరులున్నారు.

మోసం చేయడంలో కేసీఆర్ దిట్ట

- ఆయన నోరు తెరిస్తే అబద్ధాలే
- మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి


మాట్లాడుతున్న మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి

కొడంగల్ : సీఎం కేసీఆర్ నోరు తెరిస్తే అబద్ధాలు మాట్లాడుతారని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన కొడంగల్‌లో పర్యటించి, కార్యకర్తలు, నాయకులను కలిసి స్థానిక సమస్యలను తెలుసుకున్నారు. ఎన్నికల్లో పార్టీ పరిస్థితి గురించి అంచనా వేశారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ.. కేసీఆర్ ఎన్నికల్లో ఇచ్చిన ఇంటికో ఉద్యోగం, డబుల్ బెడ్‌రూం ఇండ్లు, దళితులకు మూడు ఎకరాల భూమి హామీలను ఇప్పటి వరకు అమలు చేయలేదని విమర్శించారు. ఎన్నికల్లో గెలవడం కోసం ఏమైనా చెబుతాడని దుయ్యబట్టారు. కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో వేల కోట్లు దండుకున్నారని దుయ్యబట్టారు. పాలమూరు రంగారెడ్డి పనులు అసంపూర్తిగా ఉన్నాయని అన్నారు. ఒక్క చోట కూడా పనులు పూర్తి కాకుండానే పాలమూరు ప్రాజెక్టును ప్రారంభించి రైతులను మోసం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నార్లాపూర్, ఏదుల, వట్టెం, కరివెన, ఉదండాపూర్, లక్ష్మీదేవ్‌పల్లి రిజర్వాయర్ల పనులు ముందుకు సాగడం లేదన్నారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే జీఓ 69ను అమలు చేస్తామని చెప్పారు. పరిపాలనా అనుమతులు వచ్చినా బీమా ఎత్తిపోతలను కేసీఆర్ అహంకార పూరితంగా రద్దు చేశారని విమర్శించారు. మక్తల్, నారాయణపేట, కొడంగల్ నియోజకవర్గ రైతులకు సాగునీరు లేకుండా చేశారని అన్నారు. కొడంగల్ సమీప భవిష్యత్తులో అభివృద్ధి చెంది నగరంగా మారబోతుందన్నారు. కొడంగల్ మీదుగా కేంద్ర ప్రభుత్వం రెండు జాతీయ రహదారులను, రైల్వేలైన్‌ను మంజూరు చేసిందన్నారు. పాలమూరు చించోలీ జాతీయ రహదారి నిర్మాణం, రైల్వే లైన్ నిర్మాణం పూర్తయిన తర్వాత కొడంగల్ టౌన్ వికారాబాద్ జిల్లాలో నంబర్ వన్ పట్టణంగా మారుతుందన్నారు. కార్యక్రమంలో నారాయణపేట జిల్లా బీజేపీ అధ్యక్షుడు శ్రీనివాసులు, బీజేపీ నాయకులు పున్నం చంద్ లాహోటీ, బస్వరాజు, మదన్, మోహన్‌రావ్, సర్వేష్, కృష్ణాయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

'బెల్టు' తీస్తున్న పోలీసులు!



పట్టుబడిన మద్యం సీసాలు

అక్రమ మద్యం అమ్మకాలపై దాడులు
- భారీగా పట్టుబడుతున్న మద్యం

బషీరాబాద్: బెల్టు షాపులపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న దుకాణాలపై దాడులు చేసి షాపులను సీజ్ చేస్తున్నారు. బషీరాబాద్ పోలీసులు రెండు రోజుల వ్యవధిలోనే పలు బెల్టు షాపులపై దాడులు చేసి మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం బషీరాబాద్ మండలం జీవన్గీ గ్రామంలో భారీగా మద్యం విక్రయాలు జరుపుతున్నట్లు సమాచారం అందుకున్న ఎస్ఐ వేణుగోపాల్ గౌడ్ తన సిబ్బందితో దాడులు జరిపి తలారి నర్సిములు అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని కున్నారు. అతడి నుంచి రూ.8,400 విలువ చేసే మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని షాపును సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. బెల్టు షాపుల్లో మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఆనంద్‌ను ఓడించడమే లక్ష్యం


సమావేశంలో మాట్లాడుతున్న కొండల్‌రెడ్డి

- ప్రసాద్‌కుమార్‌ను 5 వేల ఓట్ల మెజార్టీతో గెలిపిస్తా
- ఎమ్మెల్యేతో అవమానాలకు గురయ్యా
- గ్రంథాలయ సంస్థ జిల్లా మాజీ చైర్మన్ కొండల్‌రెడ్డి
- 10వేల మందితో హస్తం గూటికి

మర్పల్లి: వికారాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్‌ను ఓడించేందుకే బీఆర్ఎస్ పార్టీని వీడి పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, మాజీమంత్రి ప్రసాద్ కుమార్ సమక్షంలో కాంగ్రెస్‌లో పార్టీలో చేరుతున్నానని గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కొండల్ రెడ్డి ప్రకటించారు. ఆదివారం కొండల్‌రెడ్డి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. 2018 ఎన్నికల్లో ఆనంద్‌ను గెలుపునకు కృషి చేశానని గుర్తుచేశారు. మర్పల్లి మండలంలో ఆనంద్ 3 వేల ఓట్ల ఆధిక్యం సాధించారని తెలిపారు. ఎమ్మెల్యేగా గెలుపొందిన రెండు నెలలకే తనను దూరం పెట్టారని వాపోయారు. నియోజకవర్గంలో కొందరు ఆనంద్‌కు తొత్తులుగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. అతను ఎన్నో అవమానాలకు గురి చేశారని మండిపడ్డాడు. ఆనంద్‌ను ఓడించేది కాంగ్రెస్ పార్టేనని స్పష్టం చేశారు. కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం ప్రసాద్‌కుమార్‌ను 5 వేల ఓట్ల మెజార్టీతో గెలిపించడమే లక్ష్యంగా పెట్టుకున్నానని ప్రకటించారు. ఈ సమావేశంలో సహకార సంఘం చైర్మన్ ప్రవీణ్‌రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రామేశ్వర్, బీఆర్ఎస్ మండల పార్టీ మాజీ అధ్యక్షుడు సురేశ్, పంచలింగాల, నర్సాపూర్ తండా సర్పంచ్‌లు సురేందర్‌రెడ్డి, ధరమ్‌సింగ్, పట్లూర్ మాజీ సర్పంచ్ సురేశ్, పట్లూర్ ఎంపీటీసీలు సురేశ్, మహేశ్, సహకార సంఘం ఉపాధ్యక్షుడు ఫసి, కోట్‌మర్పల్లి ఎంపీటీసీ సుజాత వెంకట్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

అంబరాన్నంటిన బీఆర్ఎస్ సంబరాలు


కొడంగల్ : టపాసులు కాల్చి సంబరాలు చేసుకుంటున్న కార్యకర్తలు


మర్పల్లి: సంబరాలు చేసుకుంటున్న బీఆర్ఎస్ నాయకులు

కొడంగల్ : ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డికి బీఆర్ఎస్ పార్టీ రెండోసారి పార్టీ టికెట్ కేటాయించింది. ఆదివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో సీఎం కేసీఆర్ చేతుల మీదుగా బీ ఫారం అందుకున్నారు. ఈ నేపథ్యంలో పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో బీఆర్ఎస్ నాయకులు సంబరాలు జరుపుకొన్నారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. టపాసులు కాల్చి, స్వీట్లు పంచి శుభాకాంక్షలు తెలిపారు. పట్నం నరేందర్ రెడ్డి విజయం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. రెండోసారి నరేందర్‌రెడ్డిని గెలిపించి బీఆర్ఎస్ సత్తా చాటాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో కౌన్సిలర్ మధుసూదన్‌రావ్ యాదవ్, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు దామోదర్‌రెడ్డి, చాంద్‌పాష, విష్ణువర్ధన్‌రెడ్డి, రమేష్‌బాబు, రాంనాయక్, మహేందర్‌రెడ్డి, నారాయణరెడ్డి, దేశ్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

- **హ్యాట్రిక్ సాధిస్తాం**

అనంతగిరి: ముచ్చటగా మూడోసారి విజయం సాధిస్తామని వికారాబాద్ పట్టణ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం సీఎం కేసీఆర్ ఎన్నికల మేనిఫెస్టో విడుదల చేసిన నేపథ్యంలో పట్టణంలో ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో టపాసులు పేల్చి సంబురాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మేనిఫెస్టో అందరికి, అన్ని వర్గాలకు ఆమోదయోగ్యంగా ఉందన్నారు. ప్రతిపక్షాలు డీలా పడటం ఖాయమన్నారు. డాక్టర్ మెతుకు ఆనంద్‌ను రెండోసారి వికారాబాద్ ఎమ్మెల్యేగా భారీ మెజార్టీతో గెలిపించుకుంటామన్నారు. మేనిఫెస్టోను ప్రతి ఇంటికి చేరేలా ప్రచారం చేయాలని పార్టీ కార్యకర్తలు, నాయకులకు సూచించారు. కార్యక్రమంలో పలువురు కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

- **విజయం మనదే**

పరిగి: హ్యాట్రిక్ విజయం బీఆర్ఎస్‌దే అని మరోసారి రాష్ట్ర ప్రజలకు సీఎం కేసీఆర్ భరోసా ఇచ్చారని బీఆర్ఎస్ నాయకులు అన్నారు. బీఆర్ఎస్ మెనిఫెస్టో విడుదల, ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డికి బిఫాం ఇచ్చిన సందర్భంగా ఆదివారం పట్టణ కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు టపాసులు కాల్చుతూ సంబరాలు జరుపుకొన్నారు. అనంతరం పలువురు మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ నోటి నుంచి వచ్చిన మాట తూచా తప్పకుండా అమలు చేస్తానన్నారు. బడుగు బలహీన వర్గాలకు న్యాయం జరిగిందంటే అది బీఆర్ఎస్ ప్రభుత్వంలోనేనని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్‌కుమార్, ఎంపీపీ అరవింద్‌రావు, మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్, నాయకులు ప్రవీణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


పరిగిలో టపాసులు కాల్చి సంబరాలు జరుపుకొంటున్న బీఆర్ఎస్ శ్రేణులు

- **ప్రతిపక్ష పార్టీలకు షాక్**

తాండూరు: సీఎం కేసీఆర్ విడుదల చేసిన మేనిఫెస్టో ప్రతిపక్ష పార్టీలకు షాక్ ఇచ్చిందని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర మాజీ కార్యదర్శి కరణం పురుషోత్తంరావు అన్నారు. ఆదివారం పట్టణంలోని ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి నివాసంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ పట్లోళ్ల దీపనర్సింహులు, నాయకులు కలిసి బాణాసంచాపేల్చి సంబరాలు జరుపుకొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అన్ని వర్గాల ప్రజల మేలు కలిగేలా మేనిఫెస్టో ఉందన్నారు. మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి సారథ్యంలో జిల్లా అభివృద్ధిలో పరుగులు పెడుతోందని పేర్కొన్నారు. డిసెంబర్ నెలలో మూడవ సారి సీఎంగా కేసీఆర్, రెండవసారి ఎమ్మెల్యేగా రోహిత్‌రెడ్డి కావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ సంగీతఠాకూర్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి, నాయకులు రాంలింగారెడ్డి, నరేందర్ రెడ్డి తదితరులున్నారు.

- **పేదల మేనిఫెస్టో**

మర్పల్లి: సీఎం కేసీఆర్ ప్రకటించిన మేనిఫెస్టో చాలా బాగుందని మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. ఆదివారం సాయంత్రం ఆయన సాక్షితో మాట్లాడారు. సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన ఎన్నికల మేనిఫెస్టో ప్రతిపక్షాల గుండెల్లో రైళ్లు పరుగెత్తుతున్నాయన్నారు. బీఆర్ఎస్ మరోసారి అధికారంలోకి తీసుకువచ్చేందుకు ప్రతి ఒక్కరు కారు గుర్తుకే ఓటు వేసి బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. మ్యానిఫెస్టో విడుదల చేయగానే మండల పరిధిలోని దామస్తాపూర్ గ్రామంతో పాటు పలు గ్రామాల్లో టపాసులు కాల్చి పార్టీ శ్రేణులు సంబరాలు చేసుకున్నాయి.

- **మేనిఫెస్టో అద్భుతం**

కుల్కచర్ల: సీఎం కేసీఆర్ ప్రకటించిన మేనిఫెస్టో అద్భుతంగా ఉందని చౌడాపూర్ బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు సత్తినేని సుధాకర్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన విలేకరుల సమావేశం మాట్లాడారు. నిరుపేద ప్రజల అభ్యున్నతికి చేయాల్సిన కార్యక్రమాలపై కేసీఆర్ ఎంతో అనుభవం ఉందన్నారు. వాస్తవ రూపంలో ప్రజలకు లబ్ధి జరిగే కార్యక్రమాలను మాత్రమే మేనిఫెస్టో పెట్టడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ నాగరాజు, రాష్ట్ర పంచాయతీరాజ్ కార్యదర్శి మందిపల్ వెంకట్, వీరాపూర్ సర్పంచ్ జనార్దన్‌రెడ్డి, పాల నర్సింలు, శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'ఆ సీడ్'తో రైతులకు తీవ్ర నష్టం

ప్రయోగాత్మకంగా కంది సాగు
- ఎండు తెగులు సోకి ఎండుతున్న పంట
- ఉన్నతాధికారులకు నివేదిస్తాం: ఏఓ ఝాన్సీలక్ష్మి


తెగులు సోకి ఎండిపోతున్న కంది పంట

ధారూరు: వ్యవసాయ శాస్త్రవేత్తలు ప్రయోగాలతో రూపొందించిన పీఆర్‌జీ 176 రకం కంది విత్తనాలు రైతులకు తీవ్ర నష్టాన్ని తెచ్చిపెట్టింది. వానాకాలం పంటగా ధారూరు మండలానికి పీఆర్‌జీ 176 రకం కంది విత్తనాలను సరఫరా చేసింది. వానాకాలంలో సాగు చేసిన కంది ఏపుగా పెరగడంతో రైతులు సంతోషించారు. గత 15 రోజుల నుంచి ఎండు తెగులు విజృంభిస్తుంది. ఫలితంగా కంది మొక్కలు ఎండిపోవడం ప్రారంభమైయ్యాయి. ఒకటి, రెండు అనుకుంటే పొలంలో 25 శాతం మొక్కలు ఎండిపోతున్నాయి. వేలాది రూపాయల పెట్టుబడులతో సాగుచేసిన కంది పంట డెమాన్‌స్ట్రేషన్ సీడ్‌తో పంట చేతికి వస్తుందన్న నమ్మకం లేకుండా పోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. చలక నేలల్లో సాగుచేయాలని వ్యవసాయ అధికారులు చెప్పడం, వచ్చిన విత్తనాన్ని వెనువెంటనే రైతులకు సరఫరా చేయడం జరిగింది. ఒక్క ధారూరు మండలంలో దాదాపు 650 మంది రైతులకు 26 క్వింటాళ్ల పీఆర్‌జీ 176 రకం కంది విత్తనాలను సరఫరా చేశారు. ఇందులో చాలా మంది రైతులు సాగుచేయకుండానే పప్పుగా చేసుకుని తిన్నారు. కొంతమంది మాత్రమే సాగుచేసి మోసపోయారు. కంది పంట ఎండిపోతుందని ఏఓ ఝాన్సీలక్ష్మి దృష్టికి తీసుకురాగా కొంతమంది రైతులకు ఆశ్చర్యం కలిగే సమాధానం వచ్చింది. ట్రికోడర్మా విరిడి పౌడర్‌ను కిలో విత్తనానికి కలిపి విత్తనశుద్ధి చేశాకే వాడాలని సూచించారు. విత్తనశుద్ధి అయ్యాకే మినికిట్స్ రూపంలో 4 కిలోల బ్యాగ్ తయారు చేశారని, అలాంటప్పుడు విత్తనశుద్ధి ఎందుకు చేస్తామని రైతులు ప్రశ్నించారు. కొంతమంది రైతులు విత్తనశుద్ధి చేసేందుకు ప్రయత్నించినా ఆ పౌడర్ మార్కెట్లో దొరక్కపోవడం గమనార్హం. ఒక్కసారి ఎండుతెగులు ప్రారంభమైదంటే ఏ మందు వాడిన తగ్గదని వ్యవసాయ అధికారులే స్పష్టం చేస్తున్నారు. ఎండి పోతున్న కంది పంటను చూసి రైతులు లబోదిబోమంటున్నారు. వ్యవసాయశాఖ అధికారులు, సిబ్బంది మాటలు నమ్మి నట్టేటమునిగామని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు.

విత్తనశుద్ధి చేయాల్సి ఉంటుంది: ఏఓ


మొక్కను పరిశీలిస్తున్న ఏఓ ఝాన్సీలక్ష్మి, ఏఈఓ సంజూరాథోడ్

డెమాన్‌స్ట్రేషన్ సీడ్‌గా ఇచ్చిన పీఆర్‌జీ 176 రకం కంది విత్తనాలు విత్తే ముందు విత్తనశుద్ధి తప్పక చేయాల్సి ఉంటుందని ఏఓ ఝాన్సీలక్ష్మి తెలిపారు. ఎండుతెగులు రాకుండా చేసేది ట్రైకోడర్మా విరిడి పౌడర్ అని, స్థానికంగా ఈ పౌడర్ లభ్యం కాక రైతులు విత్తనశుద్ధి చేయలేకపోయారని చెప్పారు. ఎండుతెగులతో పంట నష్టపోయిన రైతుల వివరాలను పైఅధికారులకు నివేదిస్తామని ఆమె వివరించారు.

నిబంధనలు తప్పనిసరి

తాండూరు డీఎస్పీ శేఖర్‌గౌడ్


వివిధ పార్టీల నాయకులతో మాట్లాడుతున్న డీఎస్పీ

పెద్దేముల్: ఎన్నికల నిబంధనలు ప్రతి ఒక్కరు పాటించాలని తాండూరు డీఎస్పీ శేఖర్‌గౌడ్ సూచించారు. ఆదివారం సాయంత్రం పెద్దేముల్ పోలీస్ స్టేషన్‌లో వివిధ పార్టీ నాయకులతో ఎన్నికల నిబంధనలపై సమావేశం ఏర్పాటు చేశారు. ప్రతి ఒక్కరు స్వేచ్ఛయుత వాతావరణంలో ఓటు హక్కును వినియోగించు కోవాలన్నారు. పార్టీల సమావేశాలు, ర్యాలీలు, మైక్‌సెట్‌లకు అనుమతి ఉండాలని సూచించారు. కర్ణాటక సరిహద్దులో చెక్ పోస్టులు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అనుమతి లేకుండా మద్యం విక్రయాలు చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికలకు విఘాతం కలిగించే వారిని ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదన్నారు. ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో తాండూరు రూరల్ సీఐ రాంబాబు, పెద్దేముల్ ఎస్ఐ కాశీనాథ్, జెడ్పీటీసీ ధారాసింగ్, పెద్దేముల్ బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కోహీర్ శ్రీనివాస్, బీజేపీ అధ్యక్షుడు సందీప్‌కుమార్, బీఎస్పీ పార్టీ మండల అధ్యక్షుడు రమేష్, మండల నాయకులు ఎల్లారెడ్డి, ప్రవీణ్‌కుమార్, నర్సిములు, విద్యాసాగర్, నషీర్, ప్రసాద్, దాసరి నర్సిములుతో పాటు తదితరులు పాల్గొన్నారు.

పది క్వింటాళ్ల రేషన్ బియ్యం సీజ్

యాచారం: అక్రమంగా తరలిస్తున్న 10 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పోలీసులు ఆదివారం సీజ్ చేశారు. సీఐ రామాంజనేయులు తెలిపిన ప్రకారం.. కడ్తాల్ మండల పరిధిలోని చరికొండకు చెందిన మహేశ్ యాచారం, మంచాల మండలాల పరిధిలోని పలు గ్రామాల్లో రేషన్ బియ్యాన్ని సేకరించి ఆటోలో తరలిస్తున్నాడు. నక్కర్తమేడిపల్లిలో పోలీసుల తనిఖీల్లో అక్రమంగా బియ్యం తరలిస్తున్నట్లు గుర్తించి బియ్యం స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితుడు మహేశ్‌ను అదుపులోకి తీసుకుని కేసు చేసుకొని దర్యాప్తు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.